కార్పొరేట్‌ను తలదన్నేలా...



ప్రభుత్వ మానసిక ఆస్పత్రి



పీజీ విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న డిజిటల్ లైబ్రరీ

- మానసిక ఆస్పత్రిలో ఆహ్లాదం పంచేలా మౌలిక సదుపాయాలు
- పీజీ విద్యార్థులకు అధునాతన లైబ్రరీ

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మెరుగైన వసతులతో ప్రజలకు విశేష సేవలందిస్తోంది. అధునాతన వైద్య కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. రోగులు సైతం సత్వరం ఉపశమనం పొందేలా మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. వ్యాధి నయం కావడానికి కేవలం ఔషధాలు సరిపోవని, వారికి కాస్త ఆటవిడుపు, విరామం అందించే కార్యక్రమాలు అవసరమనే విషయాన్ని గుర్తించి, అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నారు.

రిక్రియేషన్ కోసం..

ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌గా చేరిన రోగులు దీర్ఘ కాలం పాటు వైద్యం పొందుతారు. ఈ క్రమంలో వారు ఆస్పత్రిలోని వార్డులో ఉంటారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఆస్పత్రిలో ఉండిపోవడంతో వారికి



రోగుల కోసం ఏర్పాటవుతున్న రిక్రియేషన్ రూం

మానసికంగా కొంత ఇబ్బందికరంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రోగులకు కాస్త ఆటవిడుపుగా ఉండేలా ప్రత్యేక వసతులను కల్పిస్తున్నారు. దీనికోసం ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రత్యేకంగా రిక్రియేషన్ రూంకు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీనిలో ప్రత్యేకంగా మిని థియేటర్, రీడింగ్ ఏరియా, ప్లే ఏరియా ఏర్పాటు చేస్తున్నారు. వారంలో ఒక రోజు టీవీలో సినిమాలు వేయడం, వివిధ కార్యక్రమాలు ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. కొంత వరకు వ్యాధి నివారణ అయిన వారికి స్ఫూర్తినందించే నిపుణుల ప్రసంగాలు సైతం ఇక్కడ ప్రసారం చేసే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. వార పత్రికలు, పుస్తకాలు, ప్రత్యేక సంచికలు ఉంచి రోగుల్లో పఠనాసక్తిని కలిగించే విధంగా రీడింగ్ ఏరియాను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు చిన్నపాటి ఇండోర్ గేమ్స్ ఆడుకులా ప్రత్యేక సదుపాయాలను ఏర్పాడు చేస్తున్నారు.

పీజీ విద్యార్థులకు ఉపయుక్తంగా..

ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో పీజీ సైక్రియార్టీ కోర్సు చేస్తున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ప్రత్యేకంగా డిజిటల్ లైబ్రరీని సిద్ధం చేశారు. కోర్సులో భాగంగా విద్యార్థులు చదవుకోవడానికి తమకు అవసరమైన సమాచారాన్ని కంప్యూటర్ నుంచి ఇంటర్నెట్ సాయంతో పొందే విధంగా ఈ డిజిటల్ లైబ్రరీ పని చేస్తుంది. పీజీ విద్యార్థులు, డాక్టర్స్, నర్సింగ్ సిబ్బంది, ఆయాలు తమ వస్తువులను భద్రపరుచుకునే విధంగా ప్రత్యేక లాకర్లను ఏర్పాటు చేశారు. భోజన విరామ సమయంలో వైద్యులు కాస్త సేదతీరడానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. వీటితో పాటు టెలికాన్ఫరెన్సింగ్ హాల్, కాన్ఫరెన్స్ హాల్‌లను సైతం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి, సుందరంగా తీర్చిదిద్దారు.

గొడవలతో భవిష్యత్ నాశనం

- విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి
- కృష్ణా కళాశాలలో ఆర్‌ఐవో సత్యనారాయణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కాలేజీను ఆయన సందర్శించారు. రెండు రోజుల క్రితం విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో ఇందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడారు. విద్యార్థుల మధ్య కొట్లాటకు దారితీసిన పరిస్థితులపై వారిని అడిగి తెలుసుకున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ సుజాత, ఇతర అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐవో విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో కాలేజీలకు పంపిస్తున్నారని, ఉన్నతచదువులు చదివి ప్రయోజకులౌతారనే వారి నమ్మకాన్ని ఒమ్ము చేయవద్దన్నారు. సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దని, ఇంటర్మీడియెట్ విద్య ఎంతో ప్రాధాన్యతతో కూడినదని, మంచి మార్కులతో ఉత్తీర్ణులుకావటం ద్వారా భవిష్యత్ ఉన్నత చదువులకు సరైన మార్గం ఏర్పడుతుందన్నారు. 'బాగా చదువుకుంటామని, క్రమశిక్షణతో మెలుగుతామని, ఎటువంటి గొడవులకు పాల్పడమని' ఈ సందర్భంగా విద్యార్థులందరితో ఆర్‌ఐవో సత్యనారాయణ ప్రతిజ్ఞ చేయించారు.

అంకుర సంస్థలకు ఆ హబ్ సాయం

ఏయూ క్యాంపస్: యువత స్థాపించి, నిర్వహిస్తున్న అంకుర సంస్థల(స్టార్టప్)కు ఆర్థిక సహకారాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఏయూ ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు ఒక ప్రకటనలో తెలిపారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం ఏర్పాటు చేసిన నిధి పథకంలో భాగంగా యువత ఆలోచనలు, ఆవిష్కరణలుగా, ఉత్పత్తులుగా మార్చడానికి అవసరమైన మూలధనం అందిస్తామన్నారు. కనిష్టంగా రూ.2 లక్షలు, గరిష్టంగా రూ.10 లక్షల వరకు అందిస్తామని పేర్కొన్నా రు. టెక్నాలజీ, సైన్స్ ఆధారంగా పనిచేసే అంకుర సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సాంకేతిక ఆధారిత ఆవిష్కరణలకు ఫొటోటైప్ ఉత్పత్తిని 12 నెలలో తీసుకురావాల్సి ఉందన్నారు. దీనికి ఐవోటీ అనుసంధానం తప్పనిసరని అన్నారు. పూర్తి వివరాలకు ఏయూ ఆ హబ్‌లో నెలకొల్పిన ఏయూ నిధి ఐటీబీఐ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

నేడు ఏయూలో ఉద్యోగ మేళా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో, మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ ఇండియా సంస్థలో ఫార్మసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, సీఎస్, డెలివరీ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మొత్తం 90 ఖాళీలను భర్తీ చేస్తామని, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ కోర్సులను పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునన్నారు. నెలకు రూ.11,080 నుంచి రూ.16 వేలు మధ్య వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఛిట జౌరి. జీ వెబ్‌సైట్ నుంచి వివరాలు నమోదు చేసుకుని గురువారం ఉదయం 10.30 గంటలకు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం 96660 92491 నంబరులో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

దొంగతనం కేసులో ఆరు నెలల జైలు శిక్ష

విశాఖ లీగల్ : దొంగతనం చేసిన ఒక వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ నగరంలోని నాలుగో ప్రధాన మెట్రోపాలిటన్ జడ్జి బుధవారం తీర్పు చెప్పారు. నగరంలోని ఎంవీపీ కాలనీ ప్రాంతానికి చెందిన మునగపాక అప్పారావు 2022 డిసెంబర్‌లో శివాజీపాలెంలో తన ఇంటి వద్ద ఆటోని పార్కింగ్ చేశాడు. ఆ ఆటోని కడియాల రఘురామ్ దొంగిలించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎంవీపీ కాలనీ పోలీసులు దర్యాప్తు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు

జీవీఎంసీ క్రికెట్ జట్టు ఘన విజయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ క్రికెట్ జట్టు ఎన్నారై ఆస్పత్రి జట్టుపై ఘన విజయం సాధించింది. జింక్ మైదానంలో విశాఖ డిస్ట్రిక్ట్ క్రికెట్ అకాడమీ ఇన్‌స్టిట్యూషన్స్ పూల్-సీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో జీవీఎంసీ, ఎన్ఆర్‌ఐ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు రెండు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిందని అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎన్నారై హాస్పటల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేయగా, లక్ష్మీప్రసాద్ 29, సునీల్ 40 పరుగులు చేశారు. జీవీఎంసీ తరపున కెప్టెన్ శివ 3 వికెట్లు, అనీల్ 3 వికెట్లు, రాజు 2 వికెట్లు తీశారు. జీవీఎంసీ జట్టు 8 వికెట్లు నష్టపోయి విజయానికి అవసరమైన పరుగులు చేసింది. నరేష్‌కుమార్ 24, సునంద్ 33, ప్రకాష్ 28 పరుగులు చేసి జీవీఎంసీ విజయానికి దోహదపడ్డారు. ఎన్నారై హాస్పటల్ జట్టు తరపున జీపీ నాయుడు 3 వికెట్లు తీసుకున్నారు.

మైనర్ బాలలకు పరామర్శ

మహారాణిపేట: ముడసర్లోవ ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో మైనర్ బాలల కొట్లాటలో గాయపడి, కేజీహెచ్ క్యాజువాల్టీ వార్డులో చికిత్స పొందుతున్న 5గురు మైనర్ బాలలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం బుధవారం పరామర్శించారు. బాలల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులనడిగి వివరాలు తెలుసుకున్నారు. త్వరితగతిన మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. బాధిత బాలలు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భవిష్యత్తులో ఇటువంటి తగాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని హోమ్ నిర్వాహకులకు సూచించారు. హోమ్‌లో జరిగిన ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక సమర్పించాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించారు. నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేయనున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యాధికారులు, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, వన్ స్టాప్ సెంటర్ శరణ్య, లవకుశ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి'



వెలంపేట ఏరియాలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ సూచించారు. దక్షిణ నియోజకవర్గంలోని వెలంపేట పరిధిలో 91, 98 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిర్వహించిన ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బీఎల్‌వోలు డోర్ టు డోర్ వెరిఫికేషన్‌కు వచ్చినప్పుడు ఓటరు వివరాలు, డోర్ నెంబరు సరిగ్గా ఉన్నది, లేనిదీ పరిశీలించుకోవాలన్నారు. పాత ఓటర్ల వివరాలు, కొత్తగా చేరిన వారి నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటు అనేది భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని, కుటుంబంలో 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మహారాణిపేట తహసీల్దార్ టి.ఆనంద్ కుమార్, బూత్ లెవెల్ అధికారులతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- 10వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: జగనన్న ప్రభుత్వంతోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. 10వ వార్డు పరిధి సుందర్‌నగర్‌లో స్థానిక వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి జగ్గుపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లిన అక్కరమానికి ప్రజలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గతంలో మాదిరిగా కాకుండా లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వం నేరుగా ఇంటికే సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న రోడ్ల సమస్యలను కాలనీవాసులు అక్కరమాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఆమె హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ.20 లక్షలు కేటాయిస్తుందని, ఆ నిధులతో ఆయా రోడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు



రిలే దీక్షలో మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ ఏ రీజనల్ కార్యదర్శి నీలకంఠం

మద్దిలపాలెం : ప్రజా రవాణా శాఖ స్టీల్‌డిపో యాజమాన్యం సిబ్బందిపై వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరిని విడనాడాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి నీలకంఠం డిమాండ్ చేశారు. స్టీల్‌డిపో సిబ్బందికి మద్దతుగా మద్దిలపాలెం డిపో వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు రెండో రోజు బుధవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా నీలకంఠం మాట్లాడుతూ శాంతియుతంగా 25 రోజులు స్టీల్ డిపో సిబ్బంది నిరసన చేపడుతున్నా యాజమాన్యం చలించకపోవడం దారుణమన్నారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పోరాటాన్ని ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ వైస్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఎన్.మూర్తి, డిపో చీఫ్ అడ్వైజర్ ఎ.సిహెచ్.పాణి, రీజనల్ జాయింట్ సెక్రటరీ కె.వి.రమణ, డిపో కార్యదర్శి పి.సిహెచ్.ఇ.రావు, డిపో జాయింట్ సెక్రటరీ వి.రామారావు, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ బి.హనుమంతరావు, రాజు, ఐ.ఎల్.రావు, వై.జి.రావు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- టీహెచ్ఆర్ కిట్ల పంపిణీకి శతశాతం రిజిస్ట్రేషన్ చేయాలి
- ఐసీడీఎస్ అధికారుల సమీక్షలో జేసీ విశ్వనాథన్



ఐసీడీఎస్ శాఖ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెసి విశ్వనాథన్,చిత్రంలో ఐసీడీఎస్ అధికారులు

మహారాణిపేట: గర్భిణులు, బాలింతలను ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకము (టేక్ హోమ్ రేషన్ - టీహెచ్ఆర్)కు శతశాతం రిజిస్టర్ చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఇచ్చే నిత్యావసర సరకులు, టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతి నెలా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్' ద్వారా వైద్యసేవలు

బాలింతల్లో రక్తహీనత ఉన్నవారి వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల వివరాలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువ ఉన్న పిల్లల వద్దకు ప్రతీ వారం డాక్టర్‌ను పంపించి, ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మళ్లీ వచ్చే సమావేశం నాటికి పూర్తి వివరాలు తీసుకురావాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్లను ఆదేశించారు. నాడు-నేడు పనుల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ డి.వెంకటేశ్వరి, సీడీపీవోలు ఎం.వి.రమణ కుమారి, డి.నీలమణి, ఎం.శ్రీదేవి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

జైల్ రోడ్డులో మహాధర్నాకు ఏర్పాట్లు

ఎంవీపీ కాలనీ: బీజేపీ జిల్లా శ్రేణులు గురువారం తలపెట్టిన మహాధర్నాను పాత జైలు రోడ్డులో నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా ముఖ్యనాయకులు లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో ఈ సమీక్ష జరిగింది. కేంద్ర ప్రభుత్వం సర్పంచులకు ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించడాన్ని నిరసిస్తూ ధర్నా చేయనున్నారు. ఉదయం 10 గంటలకు సెంట్రల్ పార్కు దరి జైల్ రోడ్డులో ఈ ధర్నా ప్రారంభమవుతుందని బీజేపీ నాయకులు వెల్లడించారు.

వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యంతో అలరిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వర స్వామి శ్రావణ సంగీతోత్సవాల్లో భాగంగా బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఈ వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. నాద ప్రియతే నమో నమః పేరిట నిర్వహించిన భక్తి గీతాలతో కూడిన కూచిపూడి నృత్య ప్రదర్శనలతో విద్యార్థినులు అలరించారు. సిరి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలలకు చెందిన విద్యారులు ఈ ఉత్సవాల్లో నాట్యం, సంగీతం, ఇతిహాసాలు, పురాణగాథలపై ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు సాయంత్రం 4.30 గంటల నుంచి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 12, 13వ తేదీల్లో డ్రాయింగ్, కీర్తనలు, కథల పోటీలు ఉంటాయని తెలిపారు. 15న విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు హారతి, ప్రసాద వితరణ జరుగుతుందని వెల్లడించారు.

భార్యపై భర్త ఫిర్యాదు

మల్కాపురం: భార్యపై భర్త ఫిర్యాదు చేసిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. నేవల్ డాక్‌యార్డ్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ అనే వ్యక్తి 104 ఏరియా దరి మేఘాద్రిపేట నేవల్ క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. తన తల్లిదండ్రుల విషయంలో భార్య లతతో ఈయనకు మనస్పర్ధలు వచ్చాయి. ఈమేరకు భర్త గతంలో కోర్టులో విడాకులకు అప్లై చేశారు. భార్య లత మాత్రం తన భర్తతోనే ఉంటానంటోంది. అతడు లేని సమయంలో తాళం పగలగొట్టి తన తల్లిదండ్రులతో కలిసి ఆమె ఇంట్లోకి ప్రవేశిస్తుండేది. తాను విడాకుల కోసం దరఖాస్తు చేసినా.. ఎందుకు ఇంటికి వస్తున్నావని భర్త ప్రభాకర్ భార్యను ప్రశ్నించారు. ఇలా తరచూ భార్య ఇబ్బంది పెట్టడంతో భర్త బుధవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఈ దంపతులు ఆరిలోవలో నివసించేవారు. ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ప్రభాకర్ ఒంటరిగా నేవల్ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఉమెన్ ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశ ప్రేమ, ప్రకృతి పరిరక్షణ అవసరం

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- మన మట్టి మన దేశం కార్యక్రమంలో మొక్కలు నాటిన విద్యార్థులు



మొక్కలు నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి, విద్యార్థులు



మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

ఏయూ క్యాంపస్: దేశాన్ని ప్రేమించడం, ప్రకృతిని పరిరక్షించడం యువత అలవరచుకోవాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. మన మట్టి మన దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పక్కన ఉన్న స్థలంలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి లక్ష్మణ ఫలం, రామాఫలం, సీతాఫలం, జామ, దాల్చిన, ఉసిరి, మారేడు, జమ్మి, గుగ్గిలం, పనస, వాటర్ యాపిల్, పారిజాతం తదితర మొక్కలను నాటారు. ప్రకృతిని పరిరక్షించడంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. వర్సిటీలో పలు చోట్ల నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకుని సంరక్షించే బాధ్యత స్వీకరించాలని సూచించారు. దేశం ప్రథమం అనే నినాదంతో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ భక్తిని కలిగి ఉంటూ, దేశం కోసం పని చేయాలని యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్రాంత సైనికోద్యోగులను సత్కరించారు. త్రివిధ దళాలలో సేవలందించి పదవీ విరమణ చేసిన కమోడోర్ ఆర్.కె.గోస్వామి, కల్నల్ వెంకట గణపతి, కెప్టెన్ దాడి నారాయణరావు, సీపీవో ఎ.వెంకటరమణ, సుబాన్ షేక్, నాయక్ సుబేదార్ శ్రీధర్ బాబులను సన్మానించారు. వారి సేవలను ఈ సందర్భంగా శ్లాఘించారు. అనంతరం విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, టి.శోభశ్రీ, వి.విజయలక్ష్మి, ఎస్.కె.భట్టి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, డీన్ జి.వీర్రాజు, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ప్రకాష్, ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఉద్యానవనంలో నాటిన పండ్ల మొక్కలను నగరానికి చెందిన కీర్తి పట్నాయక్, అరుదైన ఔషధ మొక్కలను గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి రత్నం అందించారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మేరీ మాటి- మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌరవించాలన్నారు. అమరవీరుల గౌరవ సూచికంగా దేశంలో వివిధ ప్రాంతాలలో గ్రామ శాసనాలను ఏర్పాటు చేశారన్నారు. వీటి ద్వారా 7500 కలశాలలో మట్టి మొక్కలను సేకరించి జాతీయ స్మారక స్తూపం పక్కన అమృత్ వాటిక పేరుతో ప్రత్యేక స్తూపం ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ వారం రోజులు జరగబోయే కార్యక్రమాల గురించి కళాశాల జాతీయ పథకం అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రవిబాబు, రూపవాణి, ఎస్.వి.రామారావు, పద్మా, గోపాల నాయుడు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: పిల్లల్లో ఎన్నో వ్యాధులకు కారణమైన నులి పురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంగా పాటిస్తున్నట్టు, పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రాలు ఉచితంగా పంపిణీ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1900 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 62 కాలేజీలు, 742 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 4,75,358 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి గురువారం ఉచితంగా మాత్రలు పంపిణీ చేయనున్నామన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. 3 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు పూర్తి మాత్ర ఇచ్చి చప్పరించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తర్వాత మాత్ర ఇవ్వాలన్నారు. మాత్రల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం మాత్రలు వినియోగించలేని వారి కోసం తిరిగి ఈనెల 17న మాప్ అప్ రౌండ్ కింద అవసరమైన వారికి మాత్రలు అందిస్తామన్నారు. 5,20,000కు పైగా మాత్రలు సిద్ధం చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డి.రమారెడ్డి, ప్రొగ్రామ్ అధికారి డాక్టర్ సమత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం మెతక వైఖరితోనే మణిపూర్‌లో హింస



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న పలు బ్యాంకుల మహిళా ఉద్యోగులు

సీతమ్మధార: ప్రధాని మోదీ మణిపూర్ హింసాకాండపై స్పందించి అక్కడ ప్రజలను రక్షించాలని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదురుగా రోడ్డులో బుధవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎం.శ్రీనివాస్, ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ మే 4న మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిందన్నారు. ఈ ఘటన జరిగి 95 రోజులు కావస్తున్నా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మౌనం పాటించిందని విమర్శించారు. ఇప్పటికైనా మణిపూర్‌ను కాపాడాలని కోరారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడాలి

మణిపూర్‌లో మహిళలకు జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ ఏపీబీటీఈఎఫ్ వుమెన్ కౌన్సిల్ ఆదేశాల మేరకు విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీబీటీఈఎఫ్ అసిస్టెంట్ కన్వీనర్ వైశాలి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు, ప్రసాద్, కమలాకర్, స్వాతి, సుజాత, ప్రత్యూష పాల్గొన్నారు.